క్లుప్తంగా

21 నుంచి పెద్దింట్లమ్మ ఉత్సవాలు


పెద్దింట్లమ్మ అమ్మవారు

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసు పాలెం శివారు మెండుపాలెంలో కొలువైఉన్న పెద్దింట్లమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాలు ఈ నెల 21వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ శుక్రవారం తెలిపింది. సుమారు నెల రోజులపాటు ఈ ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు చెప్పారు. ఇందులో భాగంగా మార్చి 1న ఉదయం అమ్మవారి ప్రభ ఊరేగింపు, అదే రోజు రాత్రి గోకర్ణేశ్వరస్వామి, జలదుర్గ అమ్మవారి కల్యాణం మెండు ఉదయ భాస్కరరావు, అన్నపూర్ణ దంపతులు నిర్వహిస్తున్నట్టు కూడా కమిటీ వెల్లడించింది. మార్చి 22న అఖండ అన్న సమారాధన ఏర్పాటు చేశామన్నారు.

ఘనంగా లక్షతులసి పూజ


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారికి లక్ష తులసి ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పంచామృత మంటపారాధన, విశేష ద్రవ్యాలతో మహా స్నపనం, నూతన వస్త్ర సమర్పణ, అగ్ని మధనం, అగ్ని ప్రతిష్ఠ, హోమం, ప్రసాద వితరణ నిర్వహించారు. మధ్యాహ్నం మూలమూర్తికి , ఉత్సవ మూర్తులకు తులసి దళార్చన, అమ్మవార్లకు కుంకుమపూజ, తర్పణాలు, తులసిపూజ, ప్రధాన హోమాలు, పూర్ణాహుతి, శాంతి కల్యాణం, ఆశీర్వచనం, ప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయం గోవింద నామస్మరణతో మారుమోగింది. ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో సిబ్బంది పర్యవేక్షించారు.

ఆర్థిక సాయం

మలికిపురం: మండలంలోని ముగ్గురు నిరుపేదలకు వసుధ ఫౌండేషన్ ఆర్థిక సాయం అందించింది. బట్టేలంక గ్రామానికి చెందిన గంటా సూరిబాబు, లక్కవరంలోని మందపాటి సత్యవతి, చెవ్వాకుల లక్ష్మిలకు రూ.10 వేల చొప్పున సాయం అందించారు. శుక్రవారం ఆయా గ్రామాలలో వీరికి సంస్థ తరఫున జంపన బుజ్జిరాజు, బోనం రాజు సొమ్ము అందించారు.

మూసాయే ఖాజిమ్‌కు నివాళి


నగరంలో గుమ్మటం ఊరేగింపులో పాల్గొన్న ముస్లింలు

మామిడికుదురు: ముస్లింల ఆరాధ్య దైవం ఏడవ ప్రవక్త హజరత్ ఇమామ్ మూసాయే ఖాజిమ్ వర్ధంతిని పురస్కరించుకుని నగరంలో శుక్రవారం గుమ్మటాన్ని ఊరేగించారు. మొల్లా పంజా నుంచి గుమ్మటాన్ని తీసి మాతం చేస్తూ పెద పంజీషా వరకు ఊరేగించారు. మూసాయే ఖాజిమ్‌కు నివాళులర్పించారు. మొల్ల సిరాజ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మొదట మంజిలే కర్బలాలో షహదత్ మజ్లిస్ జరిగింది. మత ప్రబోధకులు ఇబ్రహీమ్ మజ్లిస్ ఆలపించారు. సుదూర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో వచ్చిన భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఘనంగా ముసలమ్మ తీర్థం

అలమూరు: మండలంలోని పెనికేరులో వేంచేసియున్న శ్రీవుంతలో ముసలమ్మ అమ్మవారి తీర్థం శుక్రవారం వైభవంగా జరిగింది. తీర్థోత్సవాలను పురస్కరించుకుని గ్రామస్తులు నైవేద్యాలు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమలు నూతన వస్త్రాలను అందజేశారు.

ప్యాడ్స్, పెన్నుల పంపిణీ

పి.గన్నవరం: లంకల గన్నవరం జెడ్పీహెచ్ స్కూల్‌లో మమత స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షుడు జాన్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో జీసస్ మినిస్ట్రీస్ హెల్పింగ్ హ్యాండ్స్ సహకారంతో పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులు, బిస్కెట్లు, స్వీట్లు అందించారు. పీతల జాన్‌నాక్స్ రమ్య పెళ్లి రోజును పురస్కరించుకుని వీటిని పంపిణీ చేశారు. ఎస్సై గంగాభవాని చేతుల మీదుగా వీటిని అందజేశారు. సేవా సమితి వ్యవస్థాపకుడు కోరుకొండ జాన్, గౌరవాధ్యక్షుడు నల్లా పెద్దకాపు, ఎంఈఓ కోన హెలీనా పాల్గొన్నారు.

మోటార్ సైకిల్ ఢీకొని ఒకరికి గాయాలు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో సమీపంలో మోటార్ సైకిళ్లు ఢీకొని ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. దీనిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అంబాజీపేట మండలం నందంపూడికి చెందిన చుట్టుగుళ్ళ శ్రీనివాసరావును నల్లచెరువుకి చెందిన అడపా అంజిబాబు ఢీకొన్నాడు.

శివోహం.. సన్నాహం

- శైవ క్షేత్రాల్లో ఆధ్యాత్మిక సందడి
- నేడు మహాశివరాత్రి పర్వదినం
- భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు

అలమూరు: మహాశివరాత్రి పర్వదినానికి శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. శనివారం వేకువ జామున బ్రహ్మ మూహూర్తం నుంచి రాత్రి లింగోద్భవ కాలం వరకూ స్వామివారికి పూజలు జరగనున్నాయి. మహా శివరాత్రి పర్వదినాన భక్తులు జాగరణ చేసేందుకు వీలుగా అన్ని దేవాలయాల వద్ద నిర్వాహకులు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. జొన్నాడలోని శ్రీఅన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో దేశంలోని వివిధ శైవ క్షేత్రాల నుంచి తీసుకువచ్చిన 108 శివ లింగాలు ప్రతిష్ఠితమై ఉన్నాయి. ఈ ఆలయాన్ని దర్శించుకుంటే అన్ని శైవ క్షేత్రాలను దర్శించుకున్నట్టేనని భక్తులు భావిస్తారు. ఆలయ ఆవరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంతో పాటు పాలరాతితో చెక్కిన పంచముఖ ఆంజనేయస్వామి, సీత,రామ,లక్ష్మణులు, కృష్ణార్జునుల రథం వంటి విగ్రహాలు భక్తులను ఆకట్టుకుంటాయి. పెనికేరులో వ్యాస మహామునివే నిర్మించారని చెప్పే శ్రీబాలాత్రిపుర సుందరి సమేత ఇష్టకాంతేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం. దీంతో మహాశివరాత్రి రోజున ఆలయానికి జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. అలమూరులో శ్రీపార్వతి సమేత శ్రీవిక్రమ భట్టేశ్వర స్వామి ఆలయాన్ని కాశికా భక్తుడైన విక్రమార్కుడు నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. గ్రామానికి నడిబొడ్డున 90 అడుగుల ఎత్తులో పుట్టమన్ను, మట్టి ఇటుకలతో ఈఆలయాన్ని నిర్మించారని పూర్వీకులు చెబుతారు. ఆయా ఆలయాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. జొన్నాడ గౌతమీ నది తీరంలో స్నానాల రేవులో బారికేడ్లను నిర్మించారు.


జొన్నాడలో లింగాకార రూపంలో ఉన్న శ్రీఅన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి

ఆకట్టుకుంటున్న విద్యుత్ కాంతులు

అంబాజీపేట: మండలంలోని మాచవరం, కె.పెదపూడి, పుల్లేటికుర్రు, వ్యాఘ్రేశ్వరం, ఇరుసుమండ, ముక్కామల, కముజువారిలంక, వక్కలంక, పసుపల్లి, మొసలపల్లి, గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం, చిరతపూడి, ఇసుకపూడి, నందంపూడి, తొండవరం, వాకలగరువు గ్రామాల్లో ఉన్న శివాలయాలకు రంగులతోను, విద్యుత్ దీపాలంకరణలతో అలంకరించారు. భక్తులకు ఇబ్బందులు పడకుండా ఆలయ కమిటీ సభ్యులు చర్యలు తీసుకున్నారు.

దీపోత్సవానికి ఏర్పాట్లు

మలికిపురం: మండలంలోని కేశనపల్లి, గూడపల్లి, తూర్పుపాలెం, బట్టేలంక, చింతలమోరి, మలికిపురం, రామరాజులంక, విశ్వేశ్వరాయపురం, లక్కవరం, గుడిమెళ్లంక, మట్టపర్రు గ్రామాలలోని శివాలయాలలో భక్తుల దర్శనం కోసం సౌకర్యాలు ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి భారీ ఎత్తున నిర్వహించే దీపోత్సవానికి ఏర్పాటు చేశారు.


పెనికేరులో కొలువై ఉన్న స్వయంభు శ్రీఇష్టకాంతేశ్వరస్వామి

ఘనంగా కల్యాణం

ఆత్రేయపురం: మండల పరిధిలోని ఆత్రేయపురం, ర్యాలి, వాడపల్లి, కట్టుంగ, వసంతవాడ గ్రామాల్లో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ర్యాలి ఉమా కమండలేశ్వర స్వామి, శ్రీ జగన్మోహినీ కేశవ స్వామి, కట్టుంగ గ్రామంలో పార్వతీ సమేత నఖిలేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. వసంతవాడ పార్వతీ పరమేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. పార్వతీ పరమేశ్వరుల గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ప్రత్యేకంగా అలకరించిన రథంలో స్వామివారిని మేళతాళాలతో ఊరేగించారు. బ్యాండ్‌మేళాలు మందుగుండు సామగ్రి నడుమ స్వామివారిని రథంపై ఊరేగించారు. సాయంత్రం ఐదు గంటల నుంచి అమ్మవారికి కుంకుమార్చన శ్రీపార్వతీ పరమేశ్వర కల్యాణ మహోత్సవం నిర్వహించారు.

చలువ పందిళ్లు

రావులపాలెం: ఊబలంక, రావులపాలెం, గోపాలపురం, ముమ్మిడివరప్పాడు, రావులపాడు గ్రామాల్లో శివాలయాలు చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణలతో ముస్తాబయ్యాయి. ఊబలంక శ్రీ సర్వమంగళ సమేత ఉమామహేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.


గూడపల్లిలో కొలువైయున్న శివపార్వతులు

మందపల్లిలో ప్రత్యేక వైద్య శిబిరాలు

కొత్తపేట: మండల పరిధిలోని మందపల్లి ఉమ మందేశ్వర (శనైశ్చర) క్షేత్రంలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటుచేసినట్టు డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మశ్రీ, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎం.సుమలత తెలిపారు. మహాశివరాత్రి - శనిత్రయోదశి పర్వదినం కలిసి వచ్చినందున దేశవ్యాప్తంగా శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) క్షేత్రానికి లక్షకు పైగా భక్తులు తరలివస్తారనే అంచనాతో దేవదాయ శాఖతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేసిన విషయం తెలిసిందే.

ముక్తేశ్వరంలో..

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరంలో ముక్తికాంత క్షణముక్తేశ్వరస్వామివారి ఆలయంలో భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. ముక్తేశ్వరం తొగరపాయ (వృద్ధ గౌతమిపాయ) వద్ద భక్తులు పుణ్య స్నానాలు ఆచరించేందుకు అన్ని నదుపాయాలు కల్పించారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ధర్మాజీ



అలమూరు: మండలంలోని నర్సిపూడి గ్రామ సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కొంకిపూడి ధర్మాజీ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో ఈ నెల 20 నుంచి 24 వరకూ జరగనున్న పోటీల్లో పాల్గొననున్నారు. ఇప్పటికే పలు మార్లు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని అనేక అవార్డులు, బంగారు పతకాలు సాధించి ప్రతిభను నిరూపించుకున్నాడు. అందులో భాగంగానే ప్రతిష్ఠాత్మక ఆల్ ఇండియా సర్వీసెస్ నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొననున్నాడు.

పీహెచ్‌సీ ద్వారా మెరుగైన సేవలు

రాజోలు: తాటిపాక పీహెచ్‌సీ ద్వారా మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి జరుగుతుందని ఎంపీపీ కేతా శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. పీహెచ్‌సీ ద్వారా అందిస్తున్న సేవలను వైద్యాధికారి సీహెచ్ ఫణికిరణ్ వివరించారు. ప్రభుత్వం సమకూర్చిన ఆటోఎనలైజర్‌ను ఎంపీపీ శ్రీనివాస్ ప్రారంభించారు. ఆటో ఎనలైజర్ ద్వారా సుమారు 20 రకాల రక్త పరీక్షలు చేయవచ్చునని ఫణికిరణ్ తెలిపారు. జెడ్పీటీసీ సభ్యురాలు మట్టా శైలజ, డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాస్, ఎంపీహెచ్ఈఓ సత్యనారాయణ, సీహెచ్ఓ ఎం.ఎలిజబెత్, పీహెచ్ఎన్ ఎ.సత్యవతి, సూపర్‌వైజర్ మద్దాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాగునీరు అందించేందుకు కార్యాచరణ

ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: వేసవిలో తాగునీటి సమస్య ఏర్పడకుండా ఇప్పటి నుంచే కార్యాచరణ చేపట్టాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ కుసుమ వనజకుమారి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న చిట్టిబాబు మాట్లాడుతూ శివారు ప్రాంతాలకు తాగునీరు అందించే దిశగా ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలన్నారు. దీంతో పాటు దాళ్వా పంటకు సాగునీటి సమస్య ఏర్పడకుండా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే చిట్టిబాబు సూచించారు. కాలువ శివారు భూములకు సైతం సాగునీరు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. వైరస్ బారిన పడి చనిపోతున్న పందుల మృత కళేబరాలను పంట కాలువలు, గోదావరి నది, డ్రైన్లలో విచ్చలవిడిగా పడేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారంటూ సర్పంచ్‌లు అడబాల తాతకాపు, తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, గుబ్బల గీతాభవాని, బెల్లంకొండ రామశివ సుబ్రహ్మణ్యం ఆందోళన వ్యక్తం చేశారు. మృత కళేబరాలను పూడ్చి పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సార్వాలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు సమస్యలు సృష్టించారని పీఏసీఎస్ చైర్మన్లు కటకంశెట్టి ఆదిత్యకుమార్, బొలిశెట్టి భగవాన్ వాపోయారు. దాళ్వాలో ఈ పరిస్థితి రాకుండా ముందుగానే దిగుబడిని అంచనా వేసి దానికి అనుగుణంగా ధాన్యం కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పాశర్లపూడిలంక–లూటుకుర్రు గ్రామాల మధ్యలో వాద్రేవుపల్లి మీడియం డ్రైన్‌పై శిథిలమైన కాజ్‌వే కూలిపోయే ప్రమాదం ఉందని సర్పంచ్‌లు వాపోయారు. దీనికి తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలన్నారు. పెదపట్నంలంక ఆర్ అండ్ బీ రోడ్డును ఆధునీకరించాలని ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య డిమాండ్ చేశారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన ఎంఈఓ ఎం.ప్రసాదరాజుకు సమావేశం సంతాపం తెలిపింది. జెడ్పీటీసీ సభ్యుడు కొనిరెడ్డి అంజిబాబు, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

కనుల పండువగా ఉమా కొప్పేశ్వరస్వామి కల్యాణం

కొత్తపేట: పురాణ ప్రసిద్ధి చెందిన పలివెల క్షేత్రంలో ఉమా కొప్పేశ్వరస్వామి వార్ల కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఎంపీపీ మార్గన గంగాధరరావు పర్యవేక్షణలో ఉత్సవ కమిటీ చైర్మన్ భమిడిపాటి దుర్గాలక్ష్మీనారాయణ, దేవస్థానం ఈఓ నడింపల్లి వీఎస్ఎస్‌వీ ప్రసాదరాజు ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో రాజరాజనరేంద్రుడు నిర్మించిన కల్యాణ మంటపాన్ని పుష్పమాలలతో అలంకరించారు. శుక్రవారం తెల్లవారుజామున 3.45 గంటలకు మైలవరపు నారాయణశర్మ పర్యవేక్షణలో అర్చకులు స్వామి–అమ్మవార్ల విగ్రహాలను మంటపానికి తీసుకువచ్చి కల్యాణమూర్తులుగా అలంకరించారు. దేవస్థానం తరఫున ఎంపీపీ గంగాధరరావు దంపతులు, ఉత్సవ కమిటీ చైర్మన్ భమిడిపాటి దుర్గాలక్ష్మీనారాయణ దంపతులు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు.


పలివెలలో ఉమా కొప్పేశ్వరుల కల్యాణోత్సవంలో పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎంపీపీ గంగాధరరావు దంపతులు


మందపల్లిలో ఉమా మందేశ్వరుల కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

మందపల్లిలో..

మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) క్షేత్రంలో ఉమా మహేశ్వరుల వార్షిక కల్యాణం, మహాశివరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం రాత్రి ఆలయ ప్రాంగణంలో దేవదాయ–ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, దేవస్థానం ఈఓ సింగం రాధ, ఉత్సవ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు అయిలూరి శ్రీరామమూర్తి, వేదపండితుల బృందం ఈ క్షేత్రంలో వేంచేసియున్న ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామి, ఉమా బ్రహ్మేశ్వరస్వామి, ఉమా నాగేశ్వరస్వామి వార్ల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. దేవస్థానం తరఫున ఎంపీపీ మార్గన గంగాధరరావు దంపతులు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. గ్రామ సర్పంచ్ సాధు వెంకటలక్ష్మి, పీడీసీ కన్వీనర్ వెంకయ్య, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్రస్వామికి

మామిడికుదురు: మహా శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా మొగలికుదురులోని జగ్గన్నపేటలో కొలువుదీరిన శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణం శుక్రవారం వైభవంగా జరిగింది. మేళతాళాలు, వేద మంత్రాల నడుమ కారుపర్తి కోటేశ్వరరావు సిద్ధాంతి ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా జరిపించారు. నల్లా జగదీష్, రమ్యరాణి, లక్కింశెట్టి ఉత్తమకుమార్, సింధుజ, కూర్మా కోటనాగమల్లేశ్వరరావు, సూర్యకుమారి దంపతులు కర్తలుగా పాల్గొని స్వామి కల్యాణోత్సవాన్ని జరిపించారు. పలువురు భక్తులు స్వామి వారి కల్యాణోత్సవంలో కర్తలుగా పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో..

అలమూరు: మండలంలోని పెదపళ్లలో వేంచేసియున్న శ్రీగోవిందమాంబ సమేత శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి 28వ వార్షిక కల్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో గురువారం రాత్రి వేద పండితులు గోదావరి రమేష్ ఆచార్యులు మంత్రోచ్చారణల మధ్య శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి వారి కల్యాణం జరిగింది. గుమ్మిలేరుకు చెందిన కొర్నుత్తి వెంకన్నబాబు, కామాక్షి దంపతులు పీటలపై కూర్చుని పూజాధికాలు జరిపారు. భక్తులు తొలుత స్వామివారికి కలశ స్థాపన జరిపి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో నిర్వహించిన ఏకాహంలో కళాకారులు భక్తి కీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

పారిశుధ్యంతో సంపూర్ణ ఆరోగ్యం

అలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం కోసం ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం.సుమలత, పి.భవానీశంకర్ కోరారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ పర్యటించి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. టుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమి, కీటకాలు దరి చేరవని, తద్వారా అంటువ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది ఫ్రై డేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. సీహెచ్ఓ పి.వెంకటరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ ఏపీపీ రాజా, సూపర్‌వైజర్లు పీవీ.రమణారావు, ఎస్.వెంకటేశ్వర్లు, పి.ఉమ, సీహెచ్.బేబి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం

శెట్టిబలిజ మహానాడు అధ్యక్షుడు కుడుపూడి

మలికిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సామాజిక న్యాయం జరుగుతుందని తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు అధ్యక్షుడు కుడుపూడి సూర్యనారాయణ పేర్కొన్నారు. మలికిపురంలో శుక్రవారం జరిగిన వైఎస్సార్ సీపీ నేతల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా జగన్ మరో 20 ఏళ్లు ఉంటారని తద్వారా రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల అభివృద్ధి పూర్తి స్థాయిలో జరుగుతుందన్నారు. సీఎం జగన్ పనితీరు, ఆశయాలను చూసే గత ఎన్నికలలో ఆయనకు సంపూర్ణ మద్దతుగా నిలిచానని సూర్యనారాయణ అన్నారు. బీసీలంతా జగన్‌కు అండగా ఉండడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సూర్యనారాయణను పార్టీ నాయకులు సన్మానించారు. తాలూకా శెట్టి బలిజ సంఘ అధ్యక్షుడు దొమ్మేటి ఉమా మహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు గుబ్బల బాబ్జి, మనోహర్, చెల్లుబోయిన బుచ్చియ్య మాస్టారు, గెద్దం తులసీ భాస్కరరావు, గుబ్బల రమేష్, కొళ్ళ వేణు ప్రసాద్, కడలి మడ్డు, గుబ్బల సత్యనారాయణ, వీర వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

రాష్ట్రానికి మరోసారి సీఎం జగనన్నే

అయినవిల్లి: జగనన్నే రాష్ట్రానికి మరోసారి సీఎం కానున్నారని స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని సిరిపల్లిలో స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో మార్చి 18వ తేదీ నుంచి నిర్వహించే జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంపై సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలతో అవగాహన సదస్సు నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే చిట్టిబాబు కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, అంబాజీపేట మార్కెట్ కమిటీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, మట్టపర్తి శ్రీనివాసరావు, నంబూరి రాంబాబు, నంబూరి వెంకటరమణరాజు, రావూరి వెంకటరామారావు, గుత్తుల నాగబాబు పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా రఘురామ్

మామిడికుదురు: బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా నయనాల రఘురామ్ ఎన్నికయ్యారు. జిల్లా బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ అధ్యక్షతన శుక్రవారం స్థానిక బీసీ సామాజిక భవనం వద్ద జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా కాగితాలపల్లి నరసింహారావు, ఆర్థిక కార్యదర్శిగా కుడుపూడి ప్రవీణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఎంఈఓ కె.ప్రసాదరాజు మృతికి సమావేశం సంతాపం తెలిపింది. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సీనియర్ నాయకులు రాయుడు నాగేశ్వరరావు, గుబ్బల అప్పారావు, కారాడి నరసింహరాజు, చెల్లుబోయిన కేశవరావు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల సిబ్బంది అవగాహన ర్యాలీ

రావులపాలెం: రానున్న విద్యాసంవత్సరంలో నూరుశాతం అడ్మిషన్లు సాధించేలా స్థానిక డిగ్రీ కళాశాల ఉపాధ్యాయులు, సిబ్బంది శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక జూనియర్ కళాశాలకు వెళ్లి డిగ్రీ కళాశాలలో ఉన్న తరగతులు, ల్యాబ్‌లు, వసతులను పరిశీలించాలని విద్యార్థులను ఈ నెల 20 తేదీ ఆహ్వానించినట్టు ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరంలో డిగ్రీ కళాశాలలో చేరాలని కోరారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

అలమూరు: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎంఈఓ డి.మురళీ సత్యనారాయణ అన్నారు. అలమూరులోని వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో కోశాధికారి ఆరేటి మంగతాయారు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఏపీఎం ఎం.ధనరాజు అధ్యక్షత వహించగా ఎంఈఓ ప్రసంగించారు. స్త్రీనిధి, బ్యాంక్ లింకేజీ రుణాలు, వైఎస్సార్ చేయూత పథకాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

అలరించిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు


ఎకో ఫ్రెండ్లీ మెటీరియల్ పెన్నుతో విద్యార్థులకు ఆటోగ్రాఫ్ ఇస్తున్న జేసీ ధ్యానచంద్ర

అంబాజీపేట: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో రెండురోజుల పాటు జరిగిన జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు పలువురిని అలరించాయి. రెండవ రోజు శుక్రవారం జరిగిన కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర, జెడ్పీ సీఈఓ ఎన్.వి.వి.సత్యనారాయణలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పర్యావరణం, ఆరోగ్యం, పరిశుభ్రత, సాఫ్ట్‌వేర్ ఆండ్రాయిడ్ యాప్‌లు, వాతావరణ మార్పులు, గణితభావన నమూనాలతో విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ఎకో ఫ్రెండ్లీ మెటీరియల్‌తో తయారు చేసిన పెన్నును ఆసక్తిగా పరిశీలించి అదే పెన్నుతో అలమూరు మండలం నందిపూడి జెడ్పీ హైస్కూల్ విద్యార్థి పెయ్యల చంద్రలేఖకు జేసీ ఆటోగ్రాఫ్ ఇచ్చారు. అనంతరం ఆ పెన్నును జేసీకి విద్యార్థి గిఫ్ట్‌గా ఇచ్చింది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలతో పాటు కార్పొరేట్ స్కూల్ విద్యార్థులు ఈ ప్రదర్శనను తిలకించి వాటి వివరాలను సేకరించారు. విద్యార్థులకు డీఈఓ ఎం.కమలకుమారి ఆధ్వర్యంలో సైన్స్, గణితంపై క్విజ్ పోటీలను నిర్వహించారు.

వాటర్ ప్లాంట్స్ తనిఖీ

రావులపాలెం: రాజమహేంద్రవరం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం వివిధ ప్రాంతాల్లో వాటర్ ప్లాంట్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విజిలెన్స్ అధికారులు ఎస్సై శ్రీనివాసరెడ్డి, ఏఓ భార్గవమహేష్, కానిస్టేబుల్స్ లోవకుమార్, ఈశ్వర్, రెవెన్యూ, ఫుడ్‌సేఫ్టీ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. రావులపాలెంలోని ఆనంద్‌వాటర్ ఫ్రెష్‌కు ప్యాకింగ్ లైసెన్స్ లేనట్టు గుర్తించారు. అనుమతులు లేని కారణంగా ఆనంద్ వాటర్ ఫ్రెష్ ప్లాంట్‌ను సీజ్ చేశామన్నారు.

ఆకట్టుకున్న కోనసీమ కొబ్బరి పీచు బొమ్మలు

మామిడికుదురు: స్వావలంబి భారత్ అభియాన్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన ఎంప్లాయిమెంట్ జనరేషన్ నేషనల్ వర్క్ షాపులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లికి చెందిన మహిళలు కొబ్బరి పీచుతో తయారు చేసిన బొమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మూడురోజుల పాటు జరిగే వర్క్ షాపు శుక్రవారం ప్రారంభమైంది. ఈ వర్క్‌షాపులో పాశర్లపూడికి చెందిన ఆక్సిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొబ్బరి పీచుతో తయారు చేసిన బొమ్మలను ప్రదర్శించే అరుదైన అవకాశం లభించింది. వివిధ రాష్ట్రాల నుంచి వర్క్ షాపునకు హాజరైన ప్రతినిధులను కొబ్బరి పీచుతో తయారు చేసిన బొమ్మలు ఆకట్టుకున్నాయి. ఈ బొమ్మలను వీక్షించిన ప్రతినిధులు వీటిని తయారు చేసిన మహిళలను అభినందించారని ఆక్సిజన్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు కటికిరెడ్డి గంగాధర్ పేర్కొన్నారు.


న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన బొమ్మల స్టాల్